కథ

# పాదరసం

— ఎ.సువర్ణ

పొద్దుటి పూజ పూర్తి చేసి కాఫీ ఫలహారాలు సేవించి వచ్చి కోటేశ్వరరావు హాల్లోని సోఫాలో సుఖాసీనుడై ఆనాటి వార్తా పత్రిక చదువుతున్నాడు.

అప్పుడు పోర్టికోలో ఓ వాహనం, ద్విచక్రవాహనం ఆగింది. దాని వెనకాల పోలీసు జీపు వచ్చి ఆగింది.....

'ఇంత పొద్దున్నే నన్ను చూడడాని కెవరొచ్చారబ్బా......'కోటేశ్వరరావు అనుకుంటూ పేపర్లోంచే పోర్టికోలో ఆగిన వాహనాలను చూశాడు.......లోపలి కొచ్చిన ఆగంతకుని వెనకాల వచ్చిన పోలీసులను చూసే సరికి కోటేశ్వరరావుకి కాళ్లుచేతులు చల్లపడ్డయ్యి. ఏం ఉపద్రవం ముంచుకొచ్చిందోనని.

"సార్.....నేను ఇన్‌కమ్ టాక్స్ ఆఫీసరుని. నా పేరు కేశవమూర్తి" అన్న పరిచయ వాక్యాలు వినగానే 'కోటేశ్వరరావుకి గుండెల్లో దడ మొదలైంది.

"మీ ఇంట్లో దొంగ బంగారం కిలోలు కిలోలు వుందని మాకు ఇన్‌ఫర్‌మేషన్ వచ్చింది.......మీ ఇల్లు సోదా చెయ్యడానికి సెర్చ్ వారెంటుతో వచ్చాము........" అన్న కేశవ వారెంటు నోటీసు చూపించాడు కోటేశ్వరరావుకి.

'ఈ హఠాత్ రైడ్‌కి కారణం ఏమై ఉంటుందో.....

ఆ.....వాడే......ఆ పార్థసారథిగాడే అయివుంటాడు.

వీడి కిదేం బుద్ధి.....వీడమ్మ-కడుపు మాడా....వీడి శ్రాద్ధం చెట్టుకింద పెట్టా.......' అని సినిమాల్లో కోట శ్రీనివాసరావుకి మల్లే శాపనార్థాలు పెట్టాడు కోటేశ్వరరావు.

పార్థసారధి అంటే ఎవరో కాదు. సాక్షాత్ కోటేశ్వరరావు పరిశ్రమలను నడిపించే సారధి.......బ్రహ్మాండమైన బుర్ర కోట్లు కోట్లు లాభాలు సంపాదించి పెడుతున్న పరిశ్రమలన్నీ నష్టంలో పోతున్నాయని కాగితాల మీద చూపించి ఒక్క పైసా ఇన్‌కమ్ టాక్స్‌ని కోటేశ్వరరావు కట్టక్కర లేకుండా చెయ్యగలిగిన మహా మేధావి......మహా వృక్షం నీడలో పెరిగిన చిన్న చెట్టులా కోటేశ్వరరావుని మహా మిలియనరుగా ఎదిగేందుకు సహాయపడిన పార్థసారధి తనో చిన్న మిలియనర్‌గా ఎదిగాడు........అది కోటేశ్వరరావుకి గిట్టలేదు......తన డబ్బుతో తననే కొనేస్తాడేమోనన్న భయంతో పార్థసారథిని డిస్‌మిస్ చేశాడు.......'తిన్న ఇంటి వాసాలు లెక్క పెట్టినట్లు' ఆ పార్థసారథే ఇన్‌కమ్ టాక్స్ వాళ్లకి ఇన్ ఫర్‌మేషన్ ఇచ్చాడు.......

లోపలెంతగా కంగారు పడిపోతున్నా కోటేశ్వరరావు పైకి మాత్రం గంభీరంగానే వున్నాడు.

"రండి సార్!......కూర్చోండి......."

"మేము కూర్చునేందుకు రాలేదు.....ముందు మీ ఇల్లంతా సోదా చెయ్యాలి......"

"నిరభ్యంతరంగా చెయ్యండి సార్! నేను వద్దనను. మా ఇంట్లో బ్లాక్ మనీ ఏం లేదు........ నేనన్ని టాక్సులు పర్‌ఫెక్ట్‌గా కడతాను. నేనంటే గిట్టని వాళ్లెవరో మీకు రాంగ్ ఇన్‌ఫర్‌మేషన్ ఇచ్చారు సార్......." అన్న కోటేశ్వరరావు......."ఒక్క నిముషం సార్.....నా ఆరాధ్య దైవం వెంకటాచలపతిని ప్రార్థించుకొస్తాను...." అని వాళ్ల అనుమతి కోసం ఆగకుండా దేముని గదిలోకి వెళ్లి తలుపు లేసుకున్నాడు కోటేశ్వరరావు.

పది నిముషాల తరువాత తలుపులు తెరుచుకు బయటికొచ్చిన కోటేశ్వరరావు మొహం తేటగా వుంది.

"సోదా ప్రారంభించండి సార్!......." అని సోదాకి అనుమతించాడు కోటేశ్వరరావు.

"మీకు బాగా తెలిసిన మీ తరవున ఇద్దరు సాక్షులను పిలిపించండి సార్........" కేశవ చెప్పాడు.

ఎదురింటి ఏకాంబరాన్ని, పక్కింటి ఫణిభూషణరావుని ఫోన్ చేసి రప్పించాడు కోటేశ్వరరావు. కేశవ వాళ్లచేత సాక్షి సంతకాలు చేయించి సర్చ్ మొదలు పెట్టాడు.

ఇల్లంతా, బీరువాలు, మంచాలు, కార్పెట్లు, అంగుళం అంగుళంగా వెతికి ఎక్కడా బ్లాక్ మనీ ఒక్క పచ్చనోటుకానీ, చిన్న మెత్తు దొంగ బంగారంకానీ కనిపించలేదు కేశవకి.

దేముడి గది చూడాలని చూస్తే తాళం వేసున్నది. "సార్! దేముడి గది తాళం చెవులియ్యండి......" అని అడిగాడు కేశవ.

"ఆఖరికి నా దేముడ్ని కూడా విడిచి పెట్టరా సార్......." అని అంటూనే తాళం చెవులు కేశవ చేతికిచ్చాడు కోటేశ్వరరావు.

కేశవ షూ, సాక్స్ విప్పి దేముని గదిలోకి ప్రవేశించి రెండు చేతులూ జోడించి కళ్లు మూసుకుని ప్రార్థించి, కళ్లు తెరిచి సోదా ప్రారంభించాడు.

తూర్పు ముఖంగా పెద్ద వెండి పీట మీద పెద్ద వెండి మందిరంలో అలిమేలు సమేతుడైన వెంకటాచలపతి వెండి విగ్రహాలు, ఇంకో పక్క సీతా లక్ష్మణ సమేతుడైన శ్రీరామ చంద్రమూర్తి విగ్రహాలు. రెండు వైపులా ద్వారపాలకుల్లా నిలువెత్తు వెండి దీపపు సెమ్మెల్లో దేదీప్యమానంగా దీపారాధన వెలుగుతోంది. అంతా తెల్లటి వెండిమయమే కానీ, పచ్చటి బంగారం వున్న సూచనలేవీ కనిపించలేదు కేశవకి.



"సారీ సార్!..........." దేముడి గదిలోంచి బయటికొస్తూనే కేశవ కోటేశ్వరరావుతో అని షూ వేసుకుంటున్న కేశవని చూస్తూ లోపలి దేముళ్లందరూ అయ్యో కేశవా! .......అని పరితాపపడ్డారు.

ఆరు నెలల తరువాత ఇన్‌కమ్ టాక్స్ కమిషనర్ కేశవని పిల్చి "మిస్టర్ కేశవా, ఆ కోటేశ్వరరావు మిమ్మల్నందరిని బాగా బుట్టలో వేశాడు......ఆ తనింట్లో సత్రాజిత్తుకి శమంతకమణి ఇచ్చినట్టు మణుగుల్ల మణుగుల బంగారం వుందిట. మీ కంట్లోబడకుండా ఆ బంగారం అంతా ఎక్కడో దాచాడుట. మీరే సరిగ్గా సోదా చెయ్యలేదంట్టు మళ్లీ రిపోర్టు వచ్చింది......మళ్లీ సర్చ్ వారెంట్ ఇస్తున్నాను.....వెళ్లి సోదా చేసి ఎట్లాగైనా దొంగ బంగారం కనిపెట్టండి........." అని కమిషనర్ ఉత్తరం ఇవ్వడంతో కోటేశ్వరరావు ఇంటికి బయలుదేరాడు కేశవ.

మళ్లీ వచ్చిన రైడుని చూసిన కోటేశ్వరరావు ఖంగుతిన్నాడు.

వాళ్లింకా లోపలకి రాక ముందే దేముడి గదిలోకి వెళ్లి తలువులు లోపల గడియ పెట్టుకున్నాడు.

ఇదివరకులా, పది నిముషాల తరువాతే బయటికొచ్చిన కోటేశ్వరరావు హాలులో కూర్చుమన్న కేశవని, పోలీసులను చూస్తూనే మొహం అంతా నవ్వు పులుముకుని " రండి.....రండి......" అని అప్పుడే చూసినట్లు వారికి స్వాగతం పలికాడు.

"మీకింకా నా మీద అనుమానం పోనట్లున్నదే......."

"సారీ సర్! పైనుంచి వచ్చిన ఆర్డర్సు ప్రకారం రాక తప్పలేదు సార్. :.....అన్న కేశవయ్య ఇదివరకు మల్లేనే ఇల్లంతా అతి జాగ్రత్తగా సోదా చేసి ఆఖరికి దేముడి గదిలోకి వచ్చాడు.

ఇదివరలాగే అంతా వెండిమయంలానే కనిపించింది. రూమ్ అంతా పరీక్షగా చూస్తున్న కళ్లకి ఓ చందన పెట్టె కనిపించింది. అందులో ఏముందో చూద్దామని పెట్టె చేతుల్లోకి తీసుకుని మూత తీశాడు. అందులో ఓ సీసా వుంది. అదేమిటోనని మూత తియ్యాలని ఎంత ప్రయత్నించినా మూత రాలేదు కాని సీసా కిందపడి పగిలి అందులోని ద్రవం కింద పడి నాలుగు వైపులకి గుళ్లు గుళ్లుగా చెదిరినయ్యి.

"దేముడి గదిలో పాదరసం ఎందుకు పెట్టారండీ కోటేశ్వరరావుగారూ......ఐయామ్ వెరీ సారీ!...కింద పడేసి పగులగొట్టాను......."

"ఫరవాలేదు లెండి. మా అమ్మాయి ప్రాక్టికల్స్‌కి కావాలని తెచ్చింది. బయట ఎక్కడైనా వుంచితే ఎవరైనా తీసి పగులకొడతారని దేముడి గదిలో పెట్టింది........" అని కేశవ సందేహాన్ని తీర్చాడు కోటేశ్వరరావు.

కానీ కేశవకి ఆయన మాటలు నిజం కాదనిపించింది. అందులో ఏదో మర్మం వుందనిపించింది. దేముళ్లందరూ గురుడు దార్లో పడుతున్నాడనుకున్నారు.

'మర్మం ఏమిటా అని ఆలోచిస్తూ సోఫాలో కూర్చుని టైమెంతైందోనని రిస్టు వాచి చూసుకున్నాడు కేశవ. ఆ రిస్టు వాచి కేశవ మామగారు పెళ్లిలో బంగారు గొలుసుతో అల్లుడిని బహుకరించారు.

పసువు పచ్చని మేలిమి బంగారంలా మెరిసిపోయే వాచి చైను ఓ పక్క తెల్లగా వెండిలా కనిపిస్తోంది.

'ఇదేమిటిట్లా తెల్లగా అయింది.......' అనుకుంటూనే కేశవ జేబులోంచి కర్చీవు తీసి వాఛ్ మీద తెల్లగా వున్న చోట తుడిచాడు......వూహూ...ఎంత తుడిచినా తెల్లగానే వుంది......అప్పుడే ఓ మెరుపు మెరిసింది. మళ్లీ కేశవ దేముడి గదిలోకి వెళ్లి కింద పాకుతున్న పాదరసం గుండు తీసి పచ్చగా వున్న బంగారం చైను మీద వేశాడు. వెంటనే పచ్చటి బంగారం తెల్లటి వెండిలా మారిపోయింది.

"యురేకా....." అంటూ కేశవ కేక పెట్టాడు.

కోటేశ్వరరావు చేసిన కిటుకు అర్థం అయిపోయింది కేశవకి.

మొదటిసారి రైడ్ చేసినప్పుడు దేముడికి దండం పెట్టుకు వస్తానని వెళ్లిన కోటేశ్వరరావు లోపలున్న బంగారం పీటలు, విగ్రహాలు, దీపారాధన సెమ్మెలు అన్నింటి మీద పాదరసం చల్లాడు.....అవన్నీ తెల్లగా రంగు మారినయ్యి...., అందుకనే పట్టుకోలేకపోయానని......ఈసారైనా ఆ దేముడి దయ వలన ఆ పాదరసం తన గడియారం మీద పడ్డంవల్ల రహస్యం కనిపెట్టకలిగాను....

దేముడి గది తాళం వేసి సీలు వేసి వాహనంలో ఆఫీసు కెదుతూ 'ఇంటి కెళ్లగానే వాచి చైను తీసి కుంకుడులో పెడితే ఒకటి రెండు రోజుల్లో మళ్లీ బంగారం రంగులోకి మారుతుంది......'అనుకుని ఆనందపడుతున్నాడు కేశవ.

